అన్నదాత పోరు విజయవంతం

- రైతులను వేధిస్తున్న యూరియ కొరత
- చీనీ, అరటి, ఉల్లి, వరి పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలి
- రైతుల సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని సక్రమంగా అందేవి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి



పులివెందులలో ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న సతీష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు



దివంగత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జమ్మలమడుగు : పోలీసుస్టేషన్ వద్ద బైఠాయించిన నాయకులు



పులివెందులలో అన్నదాత పోరు యాత్రలో బారీ కేడ్లతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



జమ్మలమడుగు : పార్టీ కార్యాలయం సమీపంలో ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

పులివెందుల : ప్రస్తుతం రైతులను యూరియ కొరత వేధిస్తోందని, చీనీ, అరటి, ఉల్లి, వరి పంటలకు కనీస మద్ధతు ధర కల్పించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం పులివెందులలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఆదేశాల మేరకు అన్నదాత పోరు యాత్రను ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక పాత ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి మెయిన్ బజార్, పాత ఆర్టీసీ బస్టాండు మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా పాత ఎమ్మెల్యే ఆఫీస్ వద్ద ఉన్న వైఎస్ జయమ్మ పార్కులో ఉన్న దివంగత వైఎస్ జయమ్మ, పాత ఆర్టీసీ బస్టాండు సర్కిల్ వద్ద వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి, ఉచిత పంటల బీమా పునరుద్ధరించాలి, యూరియ, ఎరువులు రైతులకు అందించాలి, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న యూరియను అరికట్టాలనే స్లోగన్స్‌తో ప్లకార్డులు చేతబూని ర్యాలీని కొనసాగించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో పీఓ నాగేంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో రైతులందరూ దీన స్థితిలో ఉన్నారని, రైతులు పండించే పంటలను కొనుగోలు చేసే నాథుడు లేరని, రైతులకు అవరమైన ఎరువులు, రసాయనాల ధరలు ఆకాశన్నంటుతున్నాయని, ఎక్కడే కానీ రైతులకు అందాల్సిన ఎరువుల సరఫరా సక్రమంగా జరగడంలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో రైతు భరోసా కేంద్రాలు ప్రతి గ్రామంలో బ్రహ్మాండంగా పనిచేశాయన్నారు. ప్రస్తుతం ఆర్‌బీకేల పరిస్థితి చూస్తే చాలా దీనస్థితిలో ఉందని, రైతులు ఎవరికి మొర పెట్టుకోవాలో కూడా అర్థం కానీ పరిస్థితి ఉందన్నారు. గడిచిన రెండు నెలల నుంచి యూరియ కొరత ఉందని, యూరియ రైతులకు అందుబాటులో లేక రైతులందరూ రోడ్లపై ఉంటే వైఎస్సార్‌సీపీ పిలుపు ఇచ్చి 10 రోజుల క్రితం రైతులకు సంబంధించిన సమస్యలపైన ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లి వినతి పత్రాలు ఇస్తామని చెప్పి సమర్పించిన తర్వాత నిన్న హడావుడిగా సీఎం కూర్చొని దీనిపై రివ్యూ పెట్టుకున్నారన్నారు. సీఎం చంద్రబాబుకు రైతుల ఇబ్బందులపట్ల, రైతులపట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చునన్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా రూ.20వేలు ప్రతి రైతుకు ఇస్తామని చెప్పిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యి దాదాపు ఒక టిన్నర సంవత్సరం అయినా ఇవ్వలేదన్నారు. రైతులకు ఉచిత ఇన్సూరెన్స్ స్కీం కూడా కట్టలేదన్నారు. రైతులు పండించిన పంటల ధరలు చూస్తే గణనీయంగా తగ్గిపోయాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మా ప్రాంతంలో పండినటువంటి పంటలు కందులు దాదాపు రూ.14వేలు అమ్మారని, ప్రస్తుతం ఎడెనిమిది వేలకే కొనేటువంటి పరిస్థితిలో లేరన్నారు. నిన్న పులివెందుల ప్రాంతానికి చెందిన రైతు నరసింహారెడ్డి చీనీ కాయలను తీసుకొని మార్కెట్ వెళ్లారని, 2,300 కేజీల చీనీ కాయలను మార్కెట్‌కు తీసుకెళితే అన్ని ఖర్చులు పోయిన తర్వాత రూ.80లు వెనక్కి ఇచ్చిన పరిస్థితి నా దృష్టికి వచ్చిందన్నారు. ఇంత దౌర్భాగ్యంగా ఉందన్నారు. ఈ రోజు రైతుల గురించి ఉద్యమిస్తుంటే సపోర్ట్ చేయాల్సింది పోయి సమస్యలు ఏమిటి మేం కూడా వస్తాం, మేం కూడా ఆర్డీఓ కార్యాలయాల వద్ద ఉంటామని చెప్పాల్సింది పోయి మీరు ఉద్యమాలు చేస్తే ప్రజల తరపున, రైతుల తరపున పోరాటాలు చేస్తే మిమ్ములను బొక్కలోకి వేస్తామని ఏరకంగా బెదిరిస్తున్నారో ఇవన్ని చూస్తే నిజంగా రైతులు వణికిపోతున్నారన్నారు. రైతుల ఆవేశం పెరిగేలోపే వారిని కాపాడాల్సిన పరిస్థితి మీపై ఉందన్నారు. రైతులకు అన్ని రకాలుగా మేలు జరిగేంత వరకు వైఎస్సార్‌సీపీ రైతుల పక్షాన నిలబడుతుందన్నారు. మీరు ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా రైతుల కోసం వైఎస్సార్‌సీపీ ముందుంటుందన్నారు.

అడగుడుగునా పోలీసుల అడ్డంకులు

పులివెందులలో మంగళవారం వైఎస్సార్‌సీపీ తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని అడుగడుగునా పోలీసులు అడ్డంకులు సృష్టించారు. ర్యాలీకి పర్మిషన్ లేదంటూ ర్యాలీలో పాల్గొనకూడదని వైఎస్సార్‌సీపీ నాయకులకు నోటీసులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులైన రసూల్, బాల అశ్వర్థరెడ్డి, చలపతి, జయకృష్ణారెడ్డి, గంగయ్య, శివ, సోపాల వీరా, ఆనంద్‌రెడ్డి, వీరారెడ్డి, గంగిరెడ్డిలకు నోటీసులు అందించారు. అనంతరం జరిగిన ర్యాలీని కూడా అడ్డుకునేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ర్యాలీ చేస్తున్న సతీష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డిలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో పులివెందుల మండల పరిశీలకుడు బలరామిరెడ్డి, మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, పులివెందుల పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డిల తోపాటు కౌన్సిలర్లు, అన్ని మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : వైఎస్సార్ సీపీ శ్రేణులు చేపట్టిన ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు గ్రాండ్ సక్సెస్ అయింది. మంగళవారం కమలాపురంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి పర్యవేక్షణలో అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతి పరులు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యాలయంకు చేరుకున్నారు. అయితే తెల్లవారు జామున నుంచే పోలీసులు అన్ని మండలాలకు చెందిన నాయకులకు నిరసన కార్యక్రమానికి హాజరు కావద్దని నోటీసులు జారీ చేశారు. అలాగే పార్టీ కార్యాలయం వద్దకు కూడా రాకుండా చాలా ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికి వైఎస్సార్ సీపీ శ్రేణులు వేల సంఖ్యలో చేరుకుని తమ నిరసన వ్యక్తం చేశారు. అయితే పోలీసులు ర్యాలీకి అనుమతి లేదని జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆయన తాము ప్రతిపక్షంలో ఉన్నామని, ప్రజల సమస్యల పరిష్కారంలో భాగంగా తాము డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏడీఏకు అందజేస్తామని పోలీసులకు తెలిపారు. దీంతో ముందుగా అనుకున్న గ్రామ చావడి నుంచి ఏడీఏ కార్యాలయం వరకు జరగాల్సిన ర్యాలీని రద్దు చేసుకుని కేవలం వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఏడీఏ కార్యాలయం వరకు మాత్రమే ర్యాలీ నిర్వహించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి... అవసరమైన మేరకు ఎరువుల అందించాలి.. అని నినదించారు. అనంతరం ఏడీఏ నరసంహారెడ్డికి వినతి పత్రం అందజేసి డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సూర్యుడిని అరచేతితో ఆపడం ఎంత కష్టమో వైఎస్సార్ సీపీ శ్రేణులు చేసే ఆందోళనలను ఆపడం కూడా అంతే కష్టమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. ఈ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, ఉల్లి, పొగాకు, మామిడి, మిర్చి రైతుల వద్దకు జగనన్న వచ్చి రైతుల సమస్యను లేవనెత్తినపుడే ప్రభుత్వం స్పందిస్తోందని, మిగిలిన సమయాల్లో మొద్దు నిద్రలో ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో హార్టికల్చర్ స్టేట్ ఎక్స్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ నగర మేయర్ నిత్యానందరెడ్డి, సోషల్ వెల్ఫేర్ మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్, అన్ని మండలాల కన్వీనర్లు రఘునాథరెడ్డి, జీఎస్ భాస్కర్‌రెడ్డి, వీరారెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, స్థానిక నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ఇస్మాయిల్, మహ్మద్ సాదిక్, కొండారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, జావీద్, మణికంఠ, అన్ని మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, వేల సంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు పోరుబాటకు పోలీసులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. సోమవారం వరకు ఎటువంటి ఆటంకం లేకుండా మైక్ పర్మిషన్లు, ర్యాలీకి అనుమతులు తీసుకున్నా రాత్రికే పోలీసులు 30 యాక్టు అమలులో ఉందని ర్యాలీని ధర్నాలు, నిరసనలు చేయకూడదంటూ పోలీసులు గ్రూపుల్లో మేసేజీలు పెట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇళ్ల దగ్గరకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. మంగళవారం ఉదయం ర్యాలీ ఉందని మైలవరం, పెద్దముడియం మండలాలనుంచి భారీగా రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు జమ్మలమడుగు వస్తుండటంతో వారిని దారిలో అడ్డగించారు. పోలీసులను లెక్క చేయకుండా గ్రామాలనుంచి భారీగా వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చేస్తున్న ర్యాలీని అడ్డుకున్నారు. ఇలా ప్రవర్తించడం సరైంది కాదని ర్యాలీ మాత్రం జరుగుతుందని ఆయన పోలీసులకు తెగేసి చెప్పారు. ర్యాలీ రామిరెడ్డిపల్లె మోటు మీదుగా పెద్దపసుపల మోటు వరకు చేరుకున్నాక అందరిని స్టేషన్‌కు తరలించారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు స్టేషన్ ఎదుటే బైఠాయించారు. కార్యకర్తలు, నాయకులు నేరుగా ఆర్డీఓ కార్యాలయం చేరుకుని ఏవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎరువులు, యూరియా రైతులకు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని ఎవరైనా రైతులు విమర్శిస్తే వారిని బొక్కలో వేయండి అంటూ సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటని ఆయన అన్నారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి , మైలవరం మండల అధ్యక్షుడు ధన్నవాడ మహేశ్వరరెడ్డి, పెద్దమడియం మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, వంగల భాస్కర్‌రెడ్డి,అధికారప్రతినిధి మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, యోబు, యువజన నాయకుడు రఘునాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రైతునాయకుడు వెంకటేష్, గురుమూర్తి, మాజీ హజ్ కమిటీ చైర్మన గౌస్‌లాజం, మహిళ విభాన జిల్లా కార్యదర్శి రాణి, మైనార్టీ నాయకులు ఫయాజ్, మార్బుల్ శ్రీను, సింగరయ్య, మూడు మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పులివెందులలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



వైఎస్సార్‌సీపీ నాయకుడు రసూల్‌కు నోటీసు అందిస్తున్న పోలీసు



పులివెందులలో ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, రైతులు

వ్యవసాయం చేయలేం



నేను 5 ఏకరాల్లో అరటి పంట సాగు చేశాను. గతంలో టన్ను రూ.24వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.8 వేలు ఉన్నది. రూ.2-3 వేలకు కూడా విక్రయించాం . ఏకరా అరటి పంట సాగు చేయాలంటే రూ.1.5 లక్షలు ఖర్చు అవుతుంది. కనీసం మద్దతు ధర రూ.10 వేలు ప్రకటిస్తే తప్పా బయట పడలేం. మద్దతు ధరలు ఇలాగే ఉంటే వ్యవసాయం చేయలేం.

– గూడా సదానందరెడ్డి, రైతు, గుడావాండ్ల పల్లె, సీకే దిన్నె మండలం.

గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు



ఉల్లి పంటకు గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదు. రెండు ఏకరాల్లో ఉల్లి పంట సాగు చేశాను. ఏకరా సాగుకు రూ.లక్ష అవుతోంది. రూ.1200 మద్దతు ధర ఇస్తే ఏ మూలకు సరిపోతుంది. వైఎస్సార్ సీపీ హయాంలో రూ.11-రూ.12వేల వరకు పలికింది. ఇప్పుడు కనీసం రూ.3వేలు మద్దతు ధర ప్రకటిస్తే గాని ఖర్చులు రావు. రైతు పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే మునుముందు వ్యవసాయం చేసే పరిస్థితి కూడా ఉండదు.

-ఎస్‌పీ శివాంజనేయరెడ్డి, రైతు, అనిమెల, వీరపునాయునిపల్లె మండలం.



కమలాపురంలో మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



కమలాపురంలో వైఎస్ విగ్రహానికి నివాళులు అర్పించి ర్యాలీని ప్రారంభిస్తున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



కమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



కమలాపురంలో ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

కార్మికుల జీతాలు రెండు రోజుల్లో చెల్లిస్తాం

వేంపల్లె : వేంపల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రెండు రోజుల్లో వారి జీతాలను అకౌంట్లలో జమ చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం డీపీఓ రాజ్యలక్ష్మి, డీఎల్పీఓ రమాదేవిలు వేంపల్లె గ్రామపంచాయతీ కార్యాలయానికి విచ్చేసి ఆయా కార్మిక సిబ్బందితో చర్చలు జరిపారు. తమకు రావాల్సిన జీతాలు చెల్లిస్తామని, వెంటనే సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని సూచించారు. అలాగే తమ పిఎఫ్, ఇతర పెండింగ్ బకాయిలు కూడా పరిష్కరించాలని డీపీఓకు సిబ్బంది కోరారు. వీటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని డీపీఓ హామీ ఇచ్చారు. కార్మికులు సమ్మెను విరమించి విధుల్లోకి చేరారు.

రూ.1.4 లక్షల నగదు వితరణ



దివ్యాంగుల సంస్థ ప్రతినిధికి నగదును అందిస్తున్న పాఠశాల డైరక్టర్, విద్యార్థులు

జమ్మలమడుగు రూరల్ : సమాజంలో దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదుకోవలసిన అవసరం ఉందని మంగళవారం బాలాజీ హైస్కూల్ డైరక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల పాఠశాలలో సోచ్ ఫౌండేషన్‌లోని దివ్యాంగులు వారిలో ఉన్న ప్రతిభను ప్రదర్శించి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా వారి సందేశం, గీతాలాపన చేసి విద్యార్థులను ఆకట్టుకున్నారు. దీంతో పాఠశాల విద్యార్థులు కష్టపడి 1,40,102 రూపాయలు దివ్యాంగుల సోచ్ ప్రతినిధి హరికి అందించారు.

కార్మికుల సమస్యలపై స్పందించాలి

ఎర్రగుంట్ల : విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలపై వెంటనే స్పందించాలని ఏపీ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావును ఆర్టీపీపీకి చెందిన ఏపీఎస్పీఈ జేఏసీ కలసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అలాగే ఈనెల 15, 16వ తేదీలలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హజరు, 17, 18 తేదీలలో ఆర్టీపీపీ సీఈ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ధర్నాలు, 19, 20వ తేదీలలో సీఈ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు, 22వ తేదీన శాంతి ర్యాలీ నిర్వహించి, కలెక్టర్‌కు రాష్ట్ర జేఏసీ రూపొందించిన విజ్ఞాపన వినతి పత్రాలు అందజేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదాల పరిశీలన

చింతకొమ్మదిన్నె : జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి, డీటీఆర్‌బీ సీఐ బాబా, చింతకొమ్మదిన్నె ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి, నేషనల్ హైవే డీఈ, ఏఈ, రవాణా శాఖ అధికారి ప్రసాద్, ఇతర అధికారులు గువ్వల చెరువు ఘాట్ వరకు రోడ్డును పరిశీలించారు. ప్రమాదాలకు కారణాలను అన్వేషించి నివారించేందుకు చేయాల్సిన పనుల గురించి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించినట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు.



ఘాట్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

రికార్డుల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న డీడీవో మైథిలి

వల్లూరు : మండల పరిషత్ కార్యాలయంలోని పలు రికార్డులను కడప డీడీవో మైథిలి మంగళవారం తనిఖీ చేశారు. 2021 నుంచి 2024 వరకు నాలుగు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తమ సిబ్బందితో కలిసి ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న నాగేళ్ల సాంబశివారెడ్డి

వేముల : వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల యూత్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మెడికల్ ల్యాబ్‌ల తనిఖీ

ఎర్రగుంట్ల : పట్టణంలోని పలు మెడికల్ ల్యాబ్‌లను ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం తనిఖీ నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ విద్యార్హత సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. ల్యాబ్‌లో అధిక రుసుం వసూలు చేస్తే ల్యాబ్‌ను మూసేస్తామని హెచ్చరించారు.

ఈ-నామ్ అమలు ప్రారంభం

పులివెందుల రూరల్ : పులివెందుల మార్కెట్ యార్డు ఆవరణలోని చీనీ కాయల క్రయ విక్రయాలలో ఈ-నామ్ విధానం అమలు ప్రారంభమైందని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : పులివెందులలో మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్త అన్నదాత పోరులో భాగంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటే నిమ్మకు నీరెత్తినట్లు కూర్చొని ఈ ముఖ్యమంత్రి రైతులను బెదిరించేటువంటి ప్రసంగాలు చేయడం చాలా బాధాకరమన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికలముందు నీవు ఇచ్చిన హామీలు ఏమిటి, ఎన్నికల తర్వాత నీవు నిర్వహిస్తున్న నిర్వాహకం ఏమిటని, ఈ రోజు నీకే నీవు ప్రశ్నించుకుని సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అధికారం కోసం నీవు చేసిన వాగ్దానాలు ఏమయ్యాయన్నారు. ప్రతి సంవత్సరం రైతులను ఆదుకునేందుకు రూ.20 వేలు ఇస్తానని చెప్పావు.. ఒకటిన్నర సంవత్సరంలో రైతులకు రూ.30వేలు ఈ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రావాల్సి ఉంటే.. నిన్న కాక మొన్న రూ.5వేలు వేసి చేతులు దులుపుకున్నావు. ఇది ఒప్పుకోం చంద్రబాబు అంటూ ఇది గుర్తు పెట్టుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆరోజు లభిస్తున్న గిట్టుబాటు ధర ఏమిటి, ఈ రోజు ఉన్నటువంటి గిట్టుబాటు ధర ఏమిటని ఒక్కసారి ఈ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ రోజు క్వింటా కందులు రూ.14వేలు ఉంటే, మరీ ఈరోజు రూ.9వేలు కూడా క్వింటా కందుల ధర లేదని చెప్పే పరిస్థితి ఉందంటే ఇంతకంటే రైతులకు హీనమైన పరిస్థితి ఏమైనా ఉందా చంద్రబాబు ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. ఒక్కసారి గుర్తు పెట్టుకో చంద్రబాబు నాయుడు నీవు, నీ కుటుంబ సభ్యులు, నీ పార్టీ సభ్యులు తింటున్నది ఈ రైతులు పండించేటువంటి పంటలు, ఈ రైతులు సుభిక్షంగా ఉన్నప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వం సుభిక్షంగా ఉంటుందన్నారు. రైతులను అణగదొక్కేటువంటి వైఖరిని ప్రదర్శిస్తే నీ ప్రభుత్వానికి రాబోయేది గడ్డు కాలమేనన్నారు. రైతుల తరపున కట్టాల్సిన ఇన్సూరెన్స్ వెంటనే కట్టాలని, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. రైతులకు కావాల్సిన యూరియ, రసాయనాలు ఆర్‌బీకే కేంద్రాలలో అందుబాటులో పెట్టాలన్నారు. రైతులను ఆదుకునేంతవరకు నీ యొక్క కొమ్ములు వంచి ఈ పోరాటం వైఎస్సార్ సీపీ చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నానన్నారు.

బాబు కోసం బస్సులు.. ప్రయాణికుల అవస్థలు

ముద్దనూరు : ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఎక్కడి ప్రయాణికులు అక్కడే బస్సుల కోసం ఎదురుచూసి అవస్థలు పడ్డారు. మంగళవారం ముద్దనూరు 4 రోడ్ల కూడలి, పాతబస్టాండు ప్రాంతాల్లో బస్సుల కోసం ప్రయాణికులు తీవ్ర అగచాట్లు ఎదుర్కొన్నారు.

అనంతపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులను అక్కడికి తరలించారు. దీంతో స్థానికంగా బస్సుల కొరత ఏర్పడింది. సాయంత్రం వేళ ఇంటికి చేరుకునేందుకు ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూసి అసహనానికి గురయ్యారు. తమ కళ్ళ ముందే ప్రయాణిస్తున్న బస్సులు ముఖ్యమంత్రి సభకు వెళ్తున్నాయని గ్రహించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రయాణికులను బస్సులు లేకుండా ఇబ్బందికి గురిచేయడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు.



ముద్దనూరు 4 రోడ్ల కూడలిలో బస్సు కోసం వేచివున్న ప్రయాణికులు